మలక్‌పేట ఎక్సైజ్ పోలీసుల దాడులు

● 200 గ్రాముల గంజాయి పట్టివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సైదాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన గంజాయి, డ్రగ్స్ మద్యం దందా కథనంతో స్పందించిన మలక్‌పేట ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. శనివారం సాయంత్రం మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో సింగరేణికాలనీ, ఖాజాబాగ్ బస్తీలలో తనిఖీలు చేపట్టారు. ఖాజాబాగ్‌లో షేక్ హబీబ్ అనే వ్యక్తి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిషేధిత మత్తుపదార్థాలు, డ్రగ్స్ అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్ తెలిపారు. స్టేషన్ పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్నా.. విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా నంబరు 8712659641కు సమాచారం ఇవ్వాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.


నిందితుడిని చూపిస్తున్న మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు


కులగణన సర్వే గురించి వివరిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కమిషనర్ సరస్వతి

కులగణనతో వెనుకబడిన కులాలకు సమన్యాయం

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వే వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర వెనుకబడిన వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్‌లోని పలు డివిజన్లలో జరుగుతున్న సర్వేను ఆదివారం కమిషనర్ పి.సరస్వతితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను స్థానికులకు వివరించారు. ఈ సర్వేతో ఎవరికీ ఎలాంటి నష్టమూ జరుగబోదని, వెనుకబడిన వర్గాల వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించబడుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లిక్కి మమతాకృష్ణారెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, ఎన్యూమరేటర్లు, సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఒక్క కెమెరా 100 మంది పోలీసులకు సమానం

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు


రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని, సీసీ కెమెరాలు నేర నియంత్రణతో పాటు, నేరస్థులను పట్టుకునేందుకు, నేర నిరూపణలో కీలకంగా పనిచేస్తాయని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ(మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2013 ప్రకారం ప్రతి వ్యాపార సముదాయంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా సీసీ కెమెరాల నిర్వహణ కూడా వారి బాధ్యతేనన్నారు. ప్రతి పౌరుడు కూడా సీసీ కెమెరాల ఏర్పాటు బాధ్యతగా భావించి ఇళ్లు, కార్యాలయాలు, దుకాణాలు, కమ్యూనిటీల్లో తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.


కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : కొప్పుల

మన్సూరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యాధులు కూడా అలాగే వస్తున్నాయని, ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, సరిత క్లినిక్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీలో ఉచితంగా కంటి, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించి రక్త, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో అనేక మంది కాలనీవాసులు విచ్చేసి కంటి, రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కాస్మోపాలిటన్ కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ, సభ్యులు గంజి సత్తయ్య, సుధాకర్ రెడ్డి, పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, భాస్కర్, శ్రీకాంత్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సురక్ష సేవా సంఘం, ధనలక్ష్మి ఆప్టికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో 64మంది పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, మాల్, మల్లేపల్లి, కడ్తాల్, వరంగల్, జనగాం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలకు చెందిన వారికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించి క్షేమంగా వారిని ఇంటికి పంపించినట్లు తెలిపారు. మూడేళ్లలో 268 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించామని పేర్కొన్నారు. ఆపరేషన్లు అవసరమైన పేదలు సురక్ష ప్రతినిధులను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజేష్‌గౌడ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : పవన్‌కుమార్

కొత్తపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్ ఎస్‌బీహెచ్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మోహన్‌నగర్ ఎస్‌బీహెచ్‌కాలనీలో పర్యటించారు. వీధి దీపాల నిర్వహణ సరిగాలేదని, స్విచ్‌బాక్సుల సమస్యలున్నాయని, అంతర్గత దారుల పక్కన వ్యర్థాలను తొలగించడంలో జాప్యం జరుగుతోందని కాలనీ ప్రతినిధులు ఆయనకు సమస్యలను విన్నవించారు. కాలనీల్లో చెత్తాచెదారం వ్యర్థాలు పోగవకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని రాంకీ పారిశుధ్య సిబ్బందిని పవన్‌కుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, కాలనీప్రతినిధులు మోహన్‌రెడ్డి, బీఎస్ఆర్‌రావు, శ్రీనివాస్, అరవింద్ పాల్గొన్నారు.

వీకర్ సెక్షన్ కాలనీ అధ్యక్షుడిగా కాసాని ఏకగ్రీవం

మన్సూరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ వీకర్ సెక్షన్ కాలనీ అధ్యక్షుడిగా కాసాని అశోక్‌యాదవ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన కాలనీ కార్యవర్గ సభ్యుల సమావేశంలో స్థానికుల అభిప్రాయాల మేరకు అధ్యక్షుడిగా అశోక్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ల పదవీకాలంలో తాను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసుల సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రెండోసారి కాలనీవాసులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల వారికి అశోక్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ కార్యవర్గ సభ్యులు ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

రాజరాజేశ్వరీకాలనీ అధ్యక్షుడిగా సింగిరెడ్డి

హయత్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని రాజరాజేశ్వరీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో కాలనీ ప్రజలు మురళీధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండ నర్సింహ, కోశాధికారిగా జాన్‌తో పాటు పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. కాలనీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగులు.. చెంతనే చెత్త కుప్పలు

● రూ.1.25 కోట్ల వ్యయంతో మీర్‌పేట చెరువుకట్టపై సెంట్రల్ లైటింగ్ సిస్టం

● స్తంభాల చుట్టూ చెత్తాచెదారం

● దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు

సరూర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పైన జిగేల్‌మనే విద్యుత్ వెలుగులు.. కింద దుర్వాసన వెదజల్లే చెత్త కుప్పలు..! వెలుగులు ప్రసరింపజేస్తున్న స్తంభాల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు.. వాటి పక్కనే కుప్పలుగా పడి ఉన్న వ్యర్థాలు..! ఇదీ మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు కట్ట మీద కనిపిస్తున్న దుస్థితి! దాదాపు రూ.1.25కోట్ల వ్యయంతో కట్టపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి సెప్టెంబరు 2వ తేదీన మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ప్రారంభించారు. ప్రారంభం రోజు సైతం స్తంభాల చుట్టూ వ్యర్థాలే ఉన్నాయి.. పిచ్చి మొక్కలు సైతం అలాగే దర్శనమిచ్చాయి.. అయినా అధికారులుగానీ, పాలకులుగానీ వాటిపై దృష్టి పెట్టలేదు. స్తంభాలు వేశామా.. బల్బులు పెట్టామా.. స్విచ్ ఆన్ చేసి వాటిని వెలిగించామా.. అన్నట్టుగా కార్యక్రమం నిర్వహించి వెళ్లిపోయారు తప్ప సదరు విద్యుత్ వెలుగు జిలుగుల మధ్య దుర్వాసన వెదజల్లుతున్న వ్యర్థాలను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం! దాంతో గత రెండున్నర నెలలుగా పెద్దచెరువు కట్టపై సెంట్రల్ లైటింగ్ కింద చెత్తకుప్పలు పేరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. అయినా వాటిని తొలగించడంపై పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కట్ట పొడవునా వ్యర్థాలే

కట్టమీద ఎక్కడో ఒక చోట కాకుండా కట్ట పొడవునా వ్యర్థాలు, పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి కట్టకు ఇరుపక్కలా ఇనుప కంచె(ఐరన్ గ్రిల్) ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశలో అధికారులు దృష్టి సారించడం లేదు. దాంతో మునిసిపల్ శానిటేషన్ సిబ్బందితో పాటు ఆ దారిన వెళ్లే వాహనదారులు సైతం చెత్తను తెచ్చి కట్ట మీద పడేసి వెళ్తున్నారు. చెత్త వేసే వారిని పట్టుకుని జరిమానా విధిస్తున్నట్టు గొప్పగా చెప్పుకునే శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది.. కట్టపై పేరుకుపోతున్న వ్యర్థాలను మాత్రం పట్టించుకోవడం లేదు.

ఇదేనా సుందరీకరణ..?

చెరువు కట్టపై విద్యుత్ దీపాలు వెలిగించి మిగతా పనులు గాలికి వదిలేయడమేనా సుందరీకరణ? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు రూ.ఏడున్నర కోట్ల వ్యయంతో సుందరీకరణ అని గతంలో ప్రకటనలు చేసినప్పటికీ ఆ దిశలో అడుగులు మాత్రం పడడం లేదు. హెచ్ఎండీయే అధికారుల నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి. చెరువులో వ్యర్థాలు పడేయడం, చెరువుకట్టపై, చెరువు నీటిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోవడంతో చెరువు పరిసరాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కట్ట మీద, చెరువులో వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.


పెద్దచెరువు కట్టపై సెంట్రల్ లైటింగ్ కింద పేరుకుపోయిన చెత్త కుప్పలు

సెంట్రల్ లైటింగ్ స్తంభాల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

కొసమెరుపు

వాస్తవానికి సెంట్రల్ లైటింగ్ అంటే రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు పాతి, వాటికి బల్బులు పెట్టడం! కానీ మీర్‌పేట్ పెద్దచెరువు కట్టపై మాత్రం చెరువు వైపు స్తంభాలు పాతి లైట్లు బిగించారు. దీనిని విద్యుదీకరణ అంటారని, సెంట్రల్ లైటింగ్ ఎంత మాత్రం కాదని ఓ అధికారి వ్యాఖ్యానించారు. సెప్టెంబరు 2వ తేదీ నాటి ప్రారంభోత్సవ శిలాఫలకం మీద సైతం 'సెంట్రల్ లైటింగ్' అనే పేర్కొనడం ఇక్కడ కొసమెరుపు!

సర్వేకు సహకరించి సమాచారం ఇవ్వండి : ప్రియాంక

ఎల్బీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎల్బీనగర్ జోన్ పరిధిలో షెడ్యూల్ ప్రకారం కచ్చితత్వంతో పూర్తి చేసేలా సమన్వయ, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నియమించిన పురపాలక శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో సర్వే జరుగుతున్న తీరును క్షుణ్నంగా పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటి యజమానులతో ప్రవర్తిస్తున్న తీరుతో పాటు వారి నుంచి సమాచారం తీసుకుంటున్న తీరును ఆ సమాచారాన్ని సర్వే ప్రశ్నావళిలో నమోదు చేస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. ముందుగా ఎల్బీనగర్ సర్కిల్ వనస్థలిపురం పరిధిలోని అభ్యుదయనగర్‌లో ఇంటింటి సర్వే జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి అక్కడ సర్వే తీరును పరిశీలించారు. అనంతరం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఎన్యూమరేషన్ బ్లాక్‌ల రూపొందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లు ప్రజల నుంచి సమాచారం తీసుకుంటున్న తీరును కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఉపకమిషనర్ సేవా ఇస్లావత్, సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత, నోడల్ అధికారులు ఎంఏ ఖదీర్, బాబురావు, ఈఈ కార్తీక్, వార్డు ఆఫీసర్ యాదగిరి పాల్గొన్నారు.


సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

హయత్‌నగర్ పరిధిలో..

వనస్థలిపురం : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కులగణనలో పాల్గొనడం హర్షణీయమని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ సెక్రటరీ డిపార్ట్‌మెంట్ నోడల్ అధికారి సీహెచ్.ప్రియాంక అన్నారు. ఆదివారం హయత్‌నగర్ డివిజన్ శారదనగర్‌లో చేపడుతున్న సర్వే ప్రక్రియను ఆమె జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేరకు సర్వే తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి పి.బలరాం పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ఆర్డీవో

అబ్దుల్లాపూర్‌మెట్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం, పసుమాముల, బాచారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు, ప్రజలతో కలిసి మాట్లాడారు. సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేతో ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రతి ఒక్కరూ పూర్తి సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా స్పెషల్ క్యాంపెయిన్ డేలో భాగంగా ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓ కార్యాలయాలను సందర్శించి బీఎల్‌ఓలతో మాట్లాడారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, ఓటర్ల తొలగింపు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. శని, ఆదివారాల్లో స్థానిక బీఎల్‌ఓ కార్యాలయాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. 18ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇందిరా, ఎన్యూమరేటర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.


సరూర్‌నగర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న పురపాలక శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్, ఉపకమిషనర్ సుజాత


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న శ్రీరాములుయాదవ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు

రేణుకఎల్లమ్మ, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సరూర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 27వ డివిజన్‌లోని కృష్ణాహోమ్స్‌కాలనీలో కొత్తగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ, పోచమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి వేద పండితులు పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక పెద్దల సమక్షంలో అమ్మవార్ల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ హాజరై అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, ఉత్సవ నిర్వాహక ప్రతినిధులు నరేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ, కాంగ్రెస్

● తెలంగాణ స్టడీ సర్కిల్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య

సరూర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో దళితుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, ఏకంగా రిజర్వేషన్లు ఎత్తేయడానికి కుట్రలు పన్నుతున్నాయని తెలంగాణ స్టడీ సర్కిల్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధంగా రెండు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మహేశ్వరం నియోజకవర్గం మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన మాలల ఆత్మీయ సమ్మేళనంలో లక్ష్మయ్య పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో 40లక్షల మందికి పైగా మాల కులస్థులు ఉన్నారని, వారందరి అభిప్రాయానికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఏకతాటిపైకి వచ్చి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించి ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంద కృష్ణమాదిగ మనువాదుల చేతిలో కీలుబొమ్మగా మారి దళితులకు తీరని అన్యాయం చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. వచ్చే నెలలో వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు లక్ష్మయ్య తెలిపారు.



మాట్లాడుతున్న మల్లేపల్లి లక్ష్మయ్య

సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మాలల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన పీవీ రావు ఆశయ సాధన కోసం మాల సంఘాలు, మాల ఉద్యోగులు, మాల మేధావులు ఐక్యంగా కదలాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్ట్ రాజేశ్వరరావు, మీర్‌పేట్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, ఎంగల యాదగిరి, గొట్టె యాదయ్య, ఆవుల జనార్దన్, రాజు వస్తాద్, రమేశ్, బత్తుల రాంప్రసాదవ్, జి.వినోద్‌కుమార్, మన్నె శ్రీధర్, బల్వంత్‌రావు, మాల జర్నలిస్టుల ఫోరమ్ నాయకులు మేకల సత్యనారాయణ, చందర్, రాజు, లింగం పాల్గొన్నారు.

చైతన్యపురిలో మూసీ నిర్వాసితుల ఆందోళన

● రివర్‌బెడ్ సర్వే మళ్లీ చేపట్టాలి.. రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రివర్ బెడ్ సర్వే మళ్లీ చేపట్టి.. మూసీకి రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ మూసీ హౌస్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవానీనగర్ నుంచి మూసీప్రాంత నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. మూసీ పునరుజ్జీవం పేరిట తమ ఇళ్లను కూల్చవద్దంటూ నినదించారు. స్థలాలను కొనుగోలు చేసి, ఇళ్లను నిర్మించుకుని ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న తమ గూడును చెదరగొట్టాలని చూడడం దుర్మార్గపు చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్ల జోలికి రాకుండా మూసీ పునరుజ్జీవం చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలవాలని వారు కోరారు. మూసీ పరీవాహక ప్రాంత సమస్యను రాజకీయ కోణంలో కాకుండా, మానవతా దృక్పథంతో చూడాలన్నారు. తమ ఇళ్ల కోసం ప్రాణాలు అర్పించడానికైనా వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ పెద్దలు సానుకూల దృక్పథంతో ఆలోచించి తమకు న్యాయం చేయాలని ముక్త కంఠంతో విన్నవించారు. ప్రభుత్వం ఇళ్ల కూల్చివేతల ఆలోచన విరమించుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంటామని ఆందోళనకారులు స్పష్టం చేశారు.



భవానీనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మూసీ నిర్వాసితులు

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

హయత్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ ఏవీనగర్‌లోని భూనీళా సమేత వెంకటేశ్వరస్వామి 25వ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు షష్ఠమి పవిత్రోత్సవాలు. 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ మేనేజింగ్ ట్రస్టీలు నోముల అశోక్‌కుమార్‌గౌడ్, శైలజారాణి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. 18వ తేదీన సాయంత్రం 6.30గంటలకు భూనీళా సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుంది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

ఔషధ మొక్కలతోనే సంపూర్ణ ఆరోగ్యం

వనస్థలిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వనస్థలిపురం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురంలోని మొదటి ముద్ద వద్ద కార్తీక క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని ఉచిత ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఐ రాజేష్ మాట్లాడుతూ కార్తీకమాసంలో ఉసిరిని పూజించడం, ఉసిరి చెట్టు కింద వన భోజనాలు చేయడం, ఉసిరిని తినడం వలన శరీరానికి పుష్కలంగా సీ విటమిన్ లభిస్తుందన్నారు. చలికాలంలో వచ్చే తరుణ వ్యాధులను నియంత్రించి వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని, తులసీ మొక్క రోజంత ఆక్సిజన్ సమృద్ధిగా ఇస్తుందన్నారు. తులసీని వాకిట్లో, పెరట్లో పెంచడం వలన ఇంట్లోకి వచ్చే బ్యాక్టీరియా, వైరస్‌లను అడ్డుకుని మనం ఆరోగ్యంగా ఉండడానికి కృషి చేస్తుందన్నారు. కాలుష్యం లేని సమాజం కోసం జాగృతి అభ్యుదయ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, జీహెచ్ఎంసీ స్వచ్ఛభారత్ ప్రాజెక్ట్ అధికారి యశశ్రీ, నగేష్, కృష్ణాదిశేషు, నవీన్‌గుప్తా, శ్రీరంగనాథ్, నందకిషోర్, దూరయ్య, అచ్యుతరావు పాల్గొన్నారు.


మొక్కలను పంపిణీ చేస్తున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, భావన శ్రీనివాస్

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

● మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం కట్టడిచేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోక్సో, నిర్భయ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, అత్యాచారాలకు పాల్పడిన దుండగులను బహిరంగ ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రయణ్, సాయి, అక్షర, దీపిక, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎల్బీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో చెట్ల కొమ్మలు కొట్టివేయడంతో పాటు 11కేవీ లైన్ నిర్వహణ పనుల కారణంగా 11 ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ డెంటల్ కాలేజీ ఫీడర్ పరిధిలోని హుడాకాలనీ, మెయిన్‌రోడ్, మోర్ వెనకాల ప్రాంతం, డీసీబీ బ్యాంక్, డెంటల్ కాలేజీ పరిసర ప్రాంతాలలో, 11కేవీ జేబీకాలనీ ఫీడర్ పరిధిలోని ఎస్‌బీహెచ్-2, శాతవాహననగర్, జనప్రియకాలనీ, దానాపూర్, టీఎన్ఆర్ శకుంతల, మానసా కన్‌స్ట్రక్షన్స్, వైష్ణవీ శిఖర పరిసర ప్రాంతాలలో, 11కేవీ అలకాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, స్నేహపురికాలనీ, ఆర్‌కేపురం పరిసర ప్రాంతాలలో, 11కేవీ చాణక్యపురి ఫీడర్ పరిధిలోని పద్మావతికాలనీ, ఆనందీ ఎన్‌క్లేవ్, శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్, కృషినగర్, విజయగార్డెన్, శ్రీనివాస్‌కాలనీ, అజయ్‌నగర్, శివానీనగర్, నువ్వులబండ, అయోధ్యనగర్ పరిసర ప్రాంతాలలో, 11కేవీ స్వాతి రెసిడెన్సీ ఫీడర్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీ, డాక్టర్స్‌కాలనీ, వీరన్నగుట్ట, అంజలి రెసిడెన్సీ, స్వాతి రెసిడెన్సీ, హత్తిగూడ, శ్రీరామ్‌నగర్‌కాలనీ, శివం హిల్స్, రాజరాజేశ్వరికాలనీ, పవన్‌గిరికాలనీ పరిసర ప్రాంతాలలో, 11కేవీ సిరీస్ ఫీడర్ పరిధిలోని సెంట్రల్ బ్యాంక్‌కాలనీ, సూర్యోదయకాలనీ, సరస్వతినగర్, మధురానగర్, హకీమాబాద్‌కాలనీ పరిసర ప్రాంతాలలో, 11కేవీ రాఘవేంద్రకాలనీ ఫీడర్ పరిధిలోని అరుణోదయకాలనీ, భాగ్యలత, ద్వారకామాయినగర్, హైకోర్టుకాలనీ పరిసర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ పుష్పాగార్డెన్ ఫీడర్ పరిధిలోని పీవీటీ మార్కెట్, డీసీబీ బ్యాంక్, అన్నపూర్ణ కల్యాణ మండపం, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్‌కాలనీ, సి-టైప్, హుడాకాలనీ, కృష్ణవేణినగర్, పుష్పాగార్డెన్, మెయిన్‌రోడ్, జోనల్ ఆఫీస్ ఎంసీహెచ్, మాతాలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాలలో, 11కేవీ నర్సింహపురి ఫీడర్ పరిధిలోని నర్సింహపురికాలనీ, హుడాకాలనీ, డాక్టర్స్‌కాలనీ రోడ్ నంబర్ 1 నుంచి 4 వరకు పరిసర ప్రాంతాలలో, 11కేవీ ఖిల్లా మైసమ్మ ఫీడర్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, గ్రీన్ హిల్స్ రోడ్ నంబర్ 4 పరిసర ప్రాంతాలలో, 11కేవీ వీరభద్రనగర్ ఫీడర్ పరిధిలోని శుభోదయకాలనీ, సూర్యనగర్, సుబ్రమణ్యనగర్, పుకట్‌నగర్, వీరభద్రనగర్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తుర్కయంజాల్, ఇంజాపూర్‌లలో..

హయత్‌నగర్ : విద్యుత్ మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా తుర్కయంజాల్, ఇంజాపూర్ 11కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ ఏఈ రవీందర్‌రెడ్డి, ఇంజాపూర్ సెక్షన్ ఏఈ రాములు తెలిపారు. తుర్కయంజాల్ 11కేవీ ఫీడర్ పరిధిలోని లక్ష్మీమేగా టౌన్ షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, లక్ష్మీగార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్ కాలనీ, తుర్కయంజాల్ గ్రామం, కమ్మగూడ 11కేవీ ఫీడర్ పరిధిలోని కమ్మగూడ ఈస్టు సూరజ్‌నగర్, సుభాష్‌నగర్, శాంతినగర్, రాజ్‌రంజిత్‌హోమ్స్, నవభారత్‌కాలనీ, ఏపీఏటీకాలనీ, ఆర్టీసీకాలనీ, వశిష్ఠ-1,2 కాలనీలు, టీచర్స్‌కాలనీ, సెంట్‌పాల్స్ పాఠశాల ప్రాంతాలలో కరెంటు ఉండదని వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా సోమవారం 11కేవీ మూసారాంబాగ్, కోదండరాంనగర్, ఎంఎంహెచ్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ధోబీఘాట్, ద్వారకాపురం, ఉస్మాన్‌పురా ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.